వీధి వ్యాపారాలకు స్థలాల పరిశీలన

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో వీధి వ్యాపారాలకు అనువైన స్థలాల ఎంపికకు డీసీ కృష్ణయ్య, డీటీసీపీ సుష్మిత, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ వెంకట్, టీపీవో సోమేశ్, పీవో ఇంద్రసేనలతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా.. వీధి వ్యాపారాలు చేసుకునేలా గ్రీన్ జోన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలోనే వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగించుకోవాలని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు సూచించారు. వీధి వ్యాపారులందరికి గుర్తింపు కార్డులను సైతం ఇస్తామన్నారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించి ఇతర జూట్ బ్యాగులు వాడేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

– మియాపూర్, ఫిబ్రవరి 10

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

భరత్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్

బాలానగర్, ఫిబ్రవరి 10 : డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌కాలనీ, ఎస్పీనగర్‌లలో డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో జలమండలి అధికారులతో కలిసి ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యను పరిశీలించారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్య ఏర్పడిన వెంటనే సంబంధిత అధికారులు గుర్తించి పనులు చేయాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చే దాకా వేచి చూడరాదని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి కావాల్సిన ప్రతి పాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి, సాంబశివరెడ్డి, పవన్‌రెడ్డి, సోమయ్య, ఉమావతిగౌడ్, వినయ్, సురేందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రభుత్వం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

మియాపూర్, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే నగర అభివృద్ధిని అడ్డుకుంటున్నదని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఐటీకి వేదికగా ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గానికి గత తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. బల్దియా పరిధిలోని కార్పొరేటర్లతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన సమీక్షాసమావేశంలో కార్పొరేటర్లు హమీద్ పటేల్, దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్ రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాధవరం రోజాదేవి, మంజులారెడ్డి, సింధురెడ్డితో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం నెలవారీ నిధుల మంజూరులోనే సగానికి పైగా కోత పెట్టిందన్నారు. తమ పార్టీ అధినేత కేసీఆర్, కేసీఆర్ పిలుపుమేరకు నగర అభివృద్ధి కొరకు ప్రభుత్వంపై పోరాడుతామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ప్రభుత్వ హామీల అమలు కోసం ప్రజలతో కలిసి ఉద్యమిస్తామన్నారు.

ప్రారంభమైన కట్టమైసమ్మ జాతర

దుండిగల్, ఫిబ్రవరి 10: సూరారం డివిజన్ పరిధిలోని సూరారం కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ తల్లి జాతర శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవతో మొదలైన ప్రత్యేక పూజల్లో భాగంగా పుణ్యావచనం, గణపతిపూజ, పంచామృత అంకురార్చణ, దీక్షాధారణ, అగ్నిప్రతిష్ఠ నిర్వహించారు. అదే విధంగా మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి కల్యాణం, తలంబ్రాలు, ఒడి బియ్యం కన్నుల పండువగా జరిగాయి. అనంతరం సాయంత్రం 5 గంటలకు సూరారం గ్రామంలోని రామాలయం నుంచి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. వేడుకల్లో దేవస్థాన కమిటీ సభ్యులతో పాటు పురప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం ప్రధాన జాతర జరుగనుంది. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ తల్లి అమ్మవార్ల అలంకరణలు, శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పణ, మంగళహారతి, బోనాల సమర్పణ, మొక్కుబడులు వంటి పూజలు నిర్వహిస్తారు. కాగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు.

రామాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయానికి తీసుకొస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు

నైతిక విలువలతో విద్యను బోధించాలి

మాదాపూర్, ఫిబ్రవరి 10: విద్యతోనే మెరుగైన సమాజం నిర్మితమవుతుందని, విద్యను నైతిక విలువలతో కలిపి బోధించడం ఎంతో ముఖ్యమని హైకోర్టు మాజీ విశ్రాంత న్యాయమూర్తి రజిని తెలిపారు. మాదాపూర్ గోకుల్ ప్లాట్స్‌లోని డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీని నిర్వాహకురాలు చావ అరుణతో కలిసి సందర్శించి విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేరాల నుంచి సమాజాన్ని విముక్తి చేయడానికి విద్య పాత్ర ఎంతో ఉందన్నారు. విద్య లేమి సమాజంలో నేరాలకు ప్రధాన కారణంగా ఉన్నట్లు చెప్పారు. కుటుంబాలు తమ ఉపాధి కొరకు వివిధ ప్రదేశాలకు వసల వచ్చిన విద్యార్థులకు విద్య విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందన్నారు. మహిళలు రాత్రి సమయంలో కూడా స్వేచ్ఛగా తిరిగే సమాజాన్ని సాధించడానికి అడుగులు వేయాలన్నారు. మహిళలు ఒంటరిగా భద్రంగా ఉండగలిగే నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించిరప్పుడే మహాత్మా గాంధీ స్వప్నం నిజమయినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ సొసైటీ విద్యార్థులు, నిర్వాహకులు ఉన్నారు.

గోకుల్ ప్లాట్స్‌లోని డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పిస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి రజిని

ప్రయోగాత్మక విజ్ఞానంతోనే మెరుగైన భవిష్యత్

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 10: పాఠ్యాంశాలను నిత్యజీవితంలో అన్వయించుకునేలా చదువులు సాగితే విద్యార్థులకు మెరుగైన విజ్ఞానం అందుతుందని ఎంఈవో అంజనేయులు సూచించారు. రంగారెడ్డి నగర్‌లోని బ్రైట్‌కాన్సెప్ట్ హైస్కూల్‌లో శనివారం స్టూడెంట్‌లీడ్ కాన్ఫరెన్స్‌ను కరస్పాండెంట్ వినోద్‌జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠ్యాంశాలను విద్యార్థులు ప్రయోగ విధానంలో ప్రదర్శించారు. విలువలు, బాధ్యతలు నేర్చుకునేలా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలని పలువురు విద్యావేత్తలు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లెడ్ ప్రతినిధులు మునిచౌదరి, మాధవి, మేడ్చల్ ట్రస్మా ఉపాధ్యక్షుడు అంజనేయులు, పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ అందజేస్తున్న తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట, ఫిబ్రవరి10: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు మూసాపేట డివిజన్ పరిధి అపంతినగర్ తోటలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో మహిళా శక్తి కీలక పాత్ర వహిస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ అధ్యక్షుడు నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తుకారాం, సత్యనారయణ, అబ్బులు, శ్రీనివాస్, మాజీద్, జోసఫ్, అంజీ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

దుండిగల్, ఫిబ్రవరి 10: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తెలిపారు. శనివారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

కేంద్రం విధానాలతో కార్మికులపై మోయలేని భారం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10 : కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలనా విధానాలతో కార్మికులపై మోయలేని భారం పడుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూహెచ్ చౌరస్తాలో ఈనెల 16న జరిగే రాష్ట్ర రవాణా రంగ కార్మికుల దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గోడపత్రికను ఆవిష్కరించారు.కార్యక్రమంలో సంఘం నేతలు రాములు, రమేశ్, మహేశ్, ఆంజనేయులు, శివశేఖర్, ప్రభాకర్, రాబూరావు, శివ, మురళీ తదితరులున్నారు.

జీఎస్టీ లేకుండా మెడిసిన విక్రయం.. ఇద్దరు అరెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10 : కేపీహెచ్‌బీ కాలనీలో జీఎస్టీ బిల్లు లేకుండా మెడిసిన్ విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేజ్‌లో ఎంఐజీ 665లో సరైనా డాక్యుమెంటేషన్ లేకుండా కొద్ది మంది వ్యక్తులు మెడిసిన విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ ఘటనలో కేపీహెచ్‌బీ కాలనీ ఇండీస్ ఇన్‌సిటీలో నివసించే శనివారపు శ్రీధర్ రెడ్డి (50), కూకట్‌పల్లి వెంకట్‌రావునగర్‌లో నివసించే కొండేటి భరత్ (30)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఔషధ ముడిపదార్థాలు చీతా, గ్లిప్టాన్ 170కేజీలు, ఎన్-1, 150 కేజీలు, ఎన్-2, 20 కేజీలు టెర్లిమిప్టాన్ 25 కేజీలు, నార్ఫో లాక్సిన్ 3 కేజీలు, గ్లిప్టామ్ పొటాషియం 3 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముడి పదార్థాలను జీఎస్టీ లేకుండా విక్రయిస్తున్నందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 10: నేరచరిత్ర ఉన్నవారిపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురు రౌడీషీటర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్

బెంగళూరులో నిర్వహించిన ఖేలో ఇండియా ఆర్ఈసీ సదరన్ ఓపెన్ టాలెంట్ హంట్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో మియాపూర్‌కు చెందిన మహంకాళి ఆదిత్య మౌర్య గోల్డ్ మెడల్ సాధించాడు. మౌర్య 80 కేజీల విభాగంలో అద్భుత ప్రతిభను కనబరిచి ఈ మెడల్‌ను సాధించాడు. స్థానిక వసిష్ఠ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న మౌర్య గోల్డ్ మెడల్ సాధించటం పట్ల కళాశాల చైర్మన్ ప్రమీలారాణి, కోచ్ నాగరాజు, హరీశ్, కార్తీక్ అభినందించారు.

– మియాపూర్, ఫిబ్రవరి 10

సంస్కృతి, హస్తకళలు ఒడిశా సొంతం

ఒడిశా ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళి సై

కొండాపూర్, ఫిబ్రవరి 10 : గొప్ప సంస్కృతి, హస్తకళలకు పెట్టింది పేరుగా ఒడిశా రాష్ట్రం ప్రఖ్యాతి చెందిందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్ రాజన్ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో స్వాభిమాన్ ఒడియా పరివార్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన చేనేత హస్తకళా, ఫుడ్, సాంస్కృతిక ఉత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చేనేత హస్తకళ, ఫుడ్ స్టాల్స్‌ని సందర్శించి, వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ప్రత్యేక అధికారి జీ.కిషన్‌రావు, బీజేపీ నాయకులు మురళీధర్‌రావు, ఒడియా పరివారీ ప్రెసిడెంట్ సుస్మిత మిశ్ర, అర్చన మిశ్రా, డీకే మహంతి, తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి డాటా ఎంట్రీ పనుల వేగవంతం

'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోవాలి

- డీఈలు చక్రవర్తి, గరత్మంతరాజు

మాదాపూర్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని ఇంటింటికి అమలు చేసేందుకు ఎలక్ట్రిక్ అధికారులు డాటా ఎంట్రీ పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో శనివారం ఎలక్ట్రిక్ సీజీఎం ఆనంద్, ఎస్ఈ వెంకన్న, డీఈ గోపాలకృష్ణ, ఏడీఈ శ్యామ్ ప్రసాద్, ఏఈ ఇంద్రసేనారెడ్డితో కలిసి సాయినగర్‌లో పర్యటించి డాటా ఎంట్రీ పనులను పరిశీలించారు. అనంతరం అర్హులైన వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో పాటు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వినియోగదారులు చేసిన దరఖాస్తు రశీదును కాలనీల్లోనే వినియోగదారుల ఎలక్ట్రిక్ సిటీ బిల్లుతో లింక్ చేయడం జరుగుతుందని, ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీజీఎం పి.ఆనంద్ తెలిపారు.

రేషన్‌కార్డుదారులకే గృహజ్యోతి

బాలానగర్ విద్యుత్‌శాఖ ఏఈ అక్బర్

బాలానగర్, ఫిబ్రవరి 10 : రేషన్‌కార్డు ఉన్న వారికే గృహజ్యోతి పథకం సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని బాలానగర్ (ఐడీపీఎల్ సెక్షన్) విద్యుత్‌శాఖ ఏఈ అక్బర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. బాలానగర్ సెక్షన్ పరిధిలో ఇప్పటికే 3100 మందిని గృహజ్యోతి పథకంలో లబ్ధిదారులుగా గుర్తించినట్లు తెలిపారు.

15వరకు దరఖాస్తుల పరిశీలన

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గృహజ్యోతి కోసం ఇచ్చిన దరఖాస్తులను బిల్లుల జారీ సమయంలో ఈనెల 15వరకు పరిశీలన చేయనున్నట్లు మేడ్చల్ విద్యుత్ డీఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులంతా తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు ఫారాన్ని చూపించాలని కోరారు. ప్రత్యేకంగా కమ్యూనిటీ హాళ్లలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని, ప్రజలంతా విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏవైనా ఫిర్యాదులు ఉంటే స్థానిక సెక్షన్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

జైలుకు వెళ్లొచ్చినా బుద్ధి మారలేదు

మూసాపేట, ఫిబ్రవరి 10: వాహనాల చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి పలుమార్లు జైలుకు వెళ్లొచ్చినా నిందితులు బుద్ధి మార్చుకోలేదు. తాజాగా ఓ దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి మూడు బైకులు, 1ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. కూకట్‌పల్లి డీఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండకు చెందిన కొంపల్లి ప్రసాద్(38), బెల్లంపల్లి గిరిబాబు(42) పాత నేరస్తులు. వీరిపై హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లొచ్చారు. కొంపల్లి ప్రసాద్‌పై 18 కేసులు, బెల్లంపల్లి గిరిబాబుపై 5 కేసులు ఉన్నాయి. తాజాగా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం చేసి పోలీసులకు చిక్కారు. వారి నుంచి మూడు బైకులు, 1ఆటో స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

దుండిగల్, ఫిబ్రవరి 10: బెల్టు షాపులపై బాచుపల్లి పోలీసులు దాడులు చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మద్యం బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి, అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా బెల్టు షాపులను ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శనివారం సర్వే నంబర్ 191, ఎన్‌టీఆర్ నగర్‌లో రెండు మద్యం బెల్టు దుకాణాలు, రాజీవ్‌గృహకల్పలో ఒక మద్యం షాపులపై దాడులు చేసి పలు మద్యం బాటిళ్లను సీజ్‌చేశారు. మద్యం విక్రయిస్తున్న మహిళలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఇక నుంచి ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

దుండిగల్, ఫిబ్రవరి 10: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. చర్చిగాగిల్లాపూర్‌లో రూ.45లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును స్థానిక కౌన్సిలర్ సుధాకర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వసతుల కల్పించడేమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ శంకర్‌నాయక్, సుధాకర్‌రెడ్డి, జయరాజ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, అమర్‌సింగ్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తదితరులు

క్రీడల్లో ప్రతిభ చూపాలి

మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరీనగర్ కాలనీలో ప్రైమ్ కిడ్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వార్షిక క్రీడా దినోత్సవాన్ని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో భాగస్వాములు కావాలని, చక్కని ప్రతిభను కనబర్చాలన్నారు. విద్యార్థులను క్రీడల దిశగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, గోపాల్‌రెడ్డి, జహంగీర్, ప్రాన్సిస్ పాల్గొన్నారు.

– మియాపూర్, ఫిబ్రవరి 10

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్య

దుండిగల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనలు..

దుండిగల్, ఫిబ్రవరి 10: కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ తండా-1కు చెందిన రాజేశ్‌నాయక్(30), భార్య స్వప్న, పిల్లలతో కలిసి మల్లంపేట్‌లోని అక్షయ కాలనీలో నివాసముంటున్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే రాజేశ్ నాయక్ నిత్యం మద్యం సేవిస్తూ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యంతాగి ఇంటికి వచ్చిన రాజేశ్‌రాయక్ భార్యతో గొడవ పడి తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. అయితే శనివారం ఉదయం రాజేశ్ నాయక్ ఎంతకిగదిలో నుంచి బయటకు రాకపోవడంతో అనుమానించిన కుటుంబసభ్యులు వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా రాజేశ్‌నాయక్‌పై దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడు...

దుండిగల్ మున్సిపాలిటీ, డీ.పోచంపల్లి పరిధి, 60 గజాలకు చెందిన హాస్సేన్ ఇంట్లో ఏడాది కాలంగా బీహార్‌కు చెందిన సోను, కిషన్ అద్దెకు ఉంటున్నారు. వీరితో పాటు నెలరోజులుగా బీహార్ రాష్ట్రానికి చెందిన నగీనా సింగ్ కొడుకు దేవేశ్‌కుమార్(22) అదే ఇంట్లో ఉంటూ వారితో కలిసి రోజూ వారి కూలీపనులు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. అయితే శుక్రవారం సోను, కిషన్‌తో పాటు ఇంటి యజమని హాస్సేన్ దంపతులు సైతం కూలీ పనులకు వెళ్లగా, దేవేశ్‌కుమార్ మాత్రం ఇంటివద్దనే ఉండిపోయాడు. కూలీపనులు ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకున్న సోనూ, కిషన్ తలుపుతట్టగా తీయలేదు. లోపలినుంచి గడియ వేసుకున్నట్లు గమనించారు. తలుపు తీయాలని ఎన్నిసార్లు పిలిచినా స్పందన లేక పోవడంతో వెంటిలెటర్‌లో నుంచి తొంగిచూడగా దేవేశ్‌కుమార్ టవల్‌తో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి, దేవేశ్‌ను కిందకు దింపి చూడగా అప్పటికే అతను మృతిచెందినట్లు గుర్తించారు. హాస్సేన్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ వైద్యశాలకు తరలించారు. కాగా దేవేశ్‌కుమార్ ఇక్కడకు రాకముందు నుంచే తన సొంతగ్రామంలో ఓ యువతితో ప్రేమలో ఉన్నాడని, ఆమె మోసం చేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సూసైడ్‌నోట్ లభించినట్లు తెలిపారు.

ఎలుకల మందుతాగి చికిత్స పొందుతూ మరో యువకుడు..

సంగారెడ్డి జిల్లా, నారాయణ్‌ఖేడ్‌కు చెందిన రంజిత్ కుటుంబంతో కలిసి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. అదే జిల్లా ఆందోల్ మండలం, తాలెమా గ్రామానికి చెందిన ఆంజనేయులు కొడుకు నిఖిల్‌కుమార్(20) తన బావ రంజిత్ ఇంట్లో ఉంటూ కూకట్‌పల్లిలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నిఖిల్‌కుమార్‌కు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడే అలవాటు ఉంది. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. కాగా ఈనెల 8న రాత్రి నిఖిల్‌కుమార్ తనకు కడుపునొప్పి వస్తుందంటూ ఎలుకల మందును సేవించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని చికిత్సకోసం సూరారంలోని ఓ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ నిఖిల్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తుదిశ్వాస విడిచాడు. రంజిత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స